
సాక్షి ఒడిశా
మంగళవారం । 29 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,69,352లు, బంగారం 2 గ్రాములు, వెండి 41 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం



భువనేశ్వర్‌: ఖుర్దారోడ్‌, పూరీ రైలు మార్గంలో పెను ప్రమాదం తప్పింది. ఈ మార్గం సాక్షిగోపాలు దగ్గర రైలు పట్టాలపై ట్రాక్టరు చిక్కుకుంది. పూరీ నుంచి పాట్నాకు బయల్దేరిన వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ దూసుకుపోవడంతో ట్రాక్టరు నుజ్జునుజ్జు అయింది. డ్రైవర్‌ ట్రాక్టర్‌ పైనుంచి దూకడంతో ఘోర ప్రమాదం తప్పింది.

న్యూస్‌రీల్‌

సత్వర సహాయానికి హామీ: సీఎం



దివ్యాంగుని ఫిర్యాదు స్వీకరించి ముఖాముఖి చర్చిస్తున్న ముఖ్యమంత్రి మోహన్‌ చరణ్‌ మాఝి

భువనేశ్వర్‌: ప్రజా ఫిర్యాదులపై ముఖ్యమంత్రి మోహన్‌ చరణ్‌ మాఝి సత్వర స్పందనకు చర్యలు చేపడుతున్నారు. స్థానిక యూనిట్‌–2 ప్రజా భియోగాల కేంద్రంలో సోమవారం జరిగిన 13వ ప్రజా ఫిర్యాదుల విచారణ పురస్కరించుకుని పీడిత వర్గంతో ముఖాముఖి చర్చించి ఫిర్యాదుల్ని స్వీకరించారు. ఈ విచారణ కార్యక్రమంలో తొమ్మిది మంది క్యాబినెట్‌ మంత్రులు, అదనపు ప్రధాన కార్యదర్శులు, సీనియర్‌ అధికారులు పాల్గొన్నారు. శిబిరానికి హాజరైన క్లిష్టమైన రోగులకు అక్కడికక్కడే తక్షణ వైద్య సహాయం అందించారు. 12వ విడత వరకు అందిన ఫిర్యాదులలో 91 శాతం ఫిర్యాదుల్ని పరిష్కరించారు. దాఖలైన 11,516 ఫిర్యాదుల్లో 10,502 ఫిర్యాదుల్ని పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం సింగిల్‌ విండో సిస్టమ్‌ ద్వారా 51 మందికి రూ. 55 లక్షలు సాయం అందజేశారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడు అరెస్టు

మల్కన్‌గిరి : బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. లిఫ్ట్‌ ఇస్తానని పిలిచి అఘాయిత్యానికి పాల్పడిన 45 ఏళ్ల దయమాడిని అరెస్టు చేసి ఎస్పీ రష్మీ రంజన్‌ అసేనపతి ఎదుట హాజరుపరిచారు.

శ్రీనివాసరావుకు పురస్కారం ప్రదానం



సత్కారం పొందుతున్న శ్రీనివాసరావు

జయపురం: జయపురం వర్ధమాన కవి, పాత్రికేయులు సింహాద్రి శ్రీనివాసరావుకు శ్రీశ్రీ కళావేదిక పురస్కారం వరించింది. ఈ నెల 27వ తేదీన విశాఖపట్నంలో జరిగిన శ్రీశ్రీ కళావేదిక 150వ జాతీయ కవితా సమ్మేళనంలో శ్రీనివాసరావును 'కవితా పురస్కారం'తో ఘనంగా సన్మానించారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

రాయగడ: గుణుపూర్‌లోని గాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 107 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. హైదరాబాద్‌లోని ఎండర్‌మైన్స్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ (హెచ్‌ఆర్‌) ఉపాధ్యక్షులు ఎ.వేంకటేశ్వరులు, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ డాక్టర్‌ ఎన్‌.వి.జె.రావు, మధు బడలమణి తదితరులు శిబిరంలో పాల్గొన్నారు. విద్యార్థులు, వర్సిటీ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గుణుపూర్‌లోని బ్లడ్‌ బ్యాంక్‌ అధికారి డాక్టర లక్ష్మణ్‌ పాత్రో, టెక్నీషియన్‌ చంద్ర శేఖర్‌ పాత్రో, రాకేష్‌ కుమార్‌ పండ, నర్సింగ్‌ విభాగం అధికారి సుభస్మిత చౌదరి సహకరించారు.

విధి నిర్వహణలో అంకితభావానికి సత్కారం



జనరల్‌ మేనేజరు సత్కారం పొందిన సిబ్బంది

భువనేశ్వర్‌: రాత్రింబవళ్లు నిరవధికంగా పరుగులు తీసే రైళ్లు సురక్షితంగా గమ్యం చేరడలంలో పట్టాల పటిష్టత అత్యంత కీలకం. పట్టాల నిర్వహణ, పర్యవేక్షణ నిరంతర ప్రక్రియ. ఈ కార్యకలాపాల్లో అంకితభావంతో సమయస్ఫూర్తి ప్రదర్శించి విపత్కర పరిస్థితుల్ని నివారించిన క్షేత్ర స్థాయి సిబ్బందికి తూర్పు కోస్తా రైల్వే జనరల్‌ మేనేజర్‌ పరమేశ్వర్‌ ఫంక్వాల్‌ నలుగురు రైల్వే ఉద్యోగులను ప్రత్యేకంగా సత్కరించారు. దబ్‌పాల్‌లో ట్రాక్‌ మెయింటెయినర్‌ – 4 బీరేంద్ర ప్రసాద్‌ గోర్లైస్‌, కుంహర్‌ సోద్రాలో ట్రాక్‌ మెయింటెయినర్‌ – 4 రోహిత్‌ కుమార్‌, ఝఖాపురాలో ట్రాఫిక్‌ పాయింట్స్‌మన్‌ అభిమన్యు దొలై, జరపడాలో ట్రాక్‌ మెయింటెయినర్‌ – 1 గౌతమ్‌ మాఝి జనరల్‌ మేనేజరు ప్రత్యేక సత్కారం పొందిన వారిలో ఉన్నారు.



ప్రభుత్వ సంరక్షణలో పసికందు

రూ.20వేలకు.. పసికందు విక్రయం

- బొలంగీరులో ఘటన

భువనేశ్వర్‌:

రాష్ట్రంలో ఇంకా పసికందుల విక్రయం వంటి ఘటనలు కనిపిస్తున్నాయి. పేదరికం కారణంగా తండ్రి నవజాత శిశువును రూ.20,000 కు అమ్మేసిన విచారకర సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బొలంగీర్‌ జిల్లాలో తీవ్ర పేదరికం కారణంగా ఆడ పసికందును రూ.20,000కి అమ్మేశారు. ఈ నెల 1న కనక్‌ రాణా ప్రసవించిన ఆడ శిశువును తండ్రి నీలా రాణా బర్‌గడ్‌ జిల్లా పాయికమల్‌ ప్రాంతానికి చెందిన మరొక వ్యక్తికి అమ్మేశాడు. బొలంగీర్‌లోని టిట్లాగడ్‌ మండలం నుంచి పిల్లల అక్రమ రవాణా ఆరోపణలు వెలువడుతున్న ఆరోపణలకు ఈ సంఘటన నిలువెత్తు రుజువుగా నిలిచింది. తీవ్ర పేదరికం మధ్య రెండో కుమార్తెను పెంచే స్థోమత లేక ఆ కుటుంబం శిశువును అమ్మకానికి పెట్టినట్లు కన్న తండ్రి తెలిపాడు. అయితే తన అంగీకారం లేకుండా పురిటి బిడ్డని నిర్దాక్షిణ్యంగా గుర్తు తెలియని మరొకరి చేతిలో పెట్టడాన్ని తట్టుకోలేక పోతున్నాను అని కన్న పేగు కోతతో బాలింత ఉసూరుమంటోంది. 'మేము పేదవాళ్లం, వలస కార్మికులుగా పనిచేస్తూ మా జీవనం సాగించేవాళ్లం. ఆరు నెలల తర్వాత నేను ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, మా సర్పంచ్‌ నా రేషన్‌ బియ్యం అందుబాటులో లేదని చెప్పారు. మేము పేదరికంలో జీవిస్తున్నాము. అందుకే, రెండవ బిడ్డను అమ్మేశాను' అని బిడ్డ తండ్రి నీలా రాణా వాపోయాడు. 'నేను పిపలాపాదర్‌ ఆస్పత్రిలో ఒక ఆడపిల్లని ప్రసవించాను. ఆ తర్వాత నా భర్త ఆ బిడ్డను నాకు తెలియని వ్యక్తికి నా అంగీకారం లేకుండా అమ్మేశాడు' అని తల్లి కనక్‌ చెబుతున్నారు.

ప్రభుత్వ సంరక్షణలో పసికందు

అమ్ముడుపోయిన పసికందును జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తున్నారు. జిల్లా బాలల రక్షణ విభాగం, టిట్లాగడ్‌, పాయికమల్‌ ఠాణాల పోలీసులు సంయుక్తంగా చేపట్టిన దర్యాప్తులో రూ. 20,000 కి అమ్ముడుపోయిన పసికందును బర్‌గడ్‌ జిల్లా పాయికమల్‌ బస్తాన్‌పడాలో సంజయ్‌ అనే వ్యక్తి ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

మృత శిశువుని ప్రసవించిన బాలిక

జగత్‌సింగ్‌పూర్‌ జిల్లా కుజంగ్‌ పోలీస్‌ ఠాణా గండకిపూర్‌ ప్రాంతానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని మృత శిశువును ప్రసవించింది. సందిగ్ధ రక్తస్రావం గుర్తించిన కుటుంబ సభ్యులు బాలికను కుజంగ్‌ మెడికల్‌ కాలేజీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆమెను 4 నెలల గర్భవతిగా నిర్ధారించారు. ఇంతలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో జగత్సింగ్‌పూర్‌ జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల పర్యవేక్షణలో బాలిక మృత శిశువును ప్రసవించింది. కౌమార బాలింత ఆరోగ్యంగా ఉన్నట్లు సమాచారం. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు అత్యవసరం.

జాతీయ మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌కు బీజేడీ ఫిర్యాదు



జాతీయ మహిళా కమిషన్‌ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు పత్రం అందజేసిన బీజేడీ ప్రతినిధి బృందం

భువనేశ్వర్‌:

రాష్ట్రంలో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్‌ సీనియర్‌ ప్రముఖ కార్యదర్శి, ప్రతినిధి డాక్టర్‌ లేఖశ్రీ సామంత్‌ సింగార్‌పై అధికార పక్షం భారతీయ జనతా పార్టీ సిటింగు ఎమ్మెల్యే సంతోష్‌ ఖటువా లైంగికంగా వేధించే, అవమానకరమైన, స్త్రీ ద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని జాతీయ మహిళా కమిషన్‌(ఎన్‌సీడబ్ల్యూ)కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో న్యూ ఢిల్లీ లోని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌కు విజయ రహత్కర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ అవమానకర సంఘటనపై బాలాసోర్‌ జిల్లా నీలగిరి ప్రాంతంలో ప్రత్యేక బృందంతో విచారణ జరిపించి సంతోష్‌ ఖటువాని అరెస్టు చేసేందుకు పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించారు. నిందితుల నుంచి బెదిరింపుల కారణంగా పీడిత డాక్టర్‌ లేఖశ్రీ సామంత్‌ సింగార్‌కు పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. డాక్టర్‌ సామంత్‌ సింగార్‌ను సిటింగు ఎమ్మెల్యేను వేశ్యగా పేర్కొని ఆమె సెక్స్‌ రాకెట్‌ నడుపుతోందని ఆరోపించి వ్యక్తిగత దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలు, పౌరులు అనేక ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. బాధిత నాయకురాలు భువనేశ్వర్‌ మహిళా పోలీస్‌ ఠాణాలో దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌పై ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని కమిషను దృష్టికి తీసుకునివెళ్లారు. మూడు వారాలు గడిచినా భువనేశ్వర్‌ మహిళా పోలీసులు లేదా బాలసోర్‌ జిల్లా పోలీసు సూపరింటెండెంటు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భారతీయ జనతా పార్టీ కూడా ఎమ్మెల్యేపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలను ప్రారంభించ లేదని జాతీయ మహిళా కమిషన్‌కు వివరించారు. ఈ పరిస్థితుల పట్ల రాజకీయాలకు అతీతంగా స్వతంత్రంగా వ్యవహరించి సాటి మహిళకు సత్వర న్యాయం కల్పించేందుకు చొరవ కల్పించుకోవాలని బీజేడీ ప్రతినిధి బృందం కోరింది.

మృతదేహం కలకలం!



మహదేవ్‌ ముర్ము మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్‌ సమితి కుదుములగుమ్మ పంచాయతీలోని ఆరోగ్య కేంద్రం వెనుక సోమవారం ఉదయం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీంతో స్థానికంగా కలకలం రేగింది. మృతదేహాన్ని చూసిన స్థానికులు ఖోయిర్‌పూట్‌ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఖోయిర్‌పూట్‌ ఐఐసీ కృష్ణచంద్ర హియల్‌ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని విచారణ ప్రారంభించారు. అయితే చనిపోయిన వ్యక్తి తన గ్రామానికి చెందినవారు కాదని స్థానికులు తెలియజేశారు. అయితే వారం రోజులుగా ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్టు కొంతమంది చెప్పడంతో ఆ దిశగా ఆరా తీశారు. బంధువుల ఇంటికి వచ్చి ఉంటారని భావించి విచారణ చేయగా.. మల్కన్‌గిరి సమితి ఎం.వి.6 గ్రామానికి చెందిన మహదేవ్‌ ముర్ము (50)గా గుర్తించారు. కుదుములగుమ్మలో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి ఈ నెల 20వ తేదీన వచ్చినట్టు తేలింది. ఆదివారం ఉదయం చెల్లెలు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అయితే మల్కన్‌గిరి వెళ్లిపోయి ఉంటాడనుకొని చెల్లెలు కూడా పట్టించుకోలేదు. సోమవారం ఉదయం తన అన్నయ్య శవమై కనిపించడంతో కన్నీరుమున్నీరుగా రోదించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఐఐసీ కృష్ణచంద్ర హియల్‌ చెప్పారు.

ఖుర్దారోడ్‌ కొత్త డీఆర్‌ఎంగా అలోక్‌ త్రిపాఠి



బాధ్యతలు స్వీకరించిన అలోక్‌ త్రిపాఠి (కుడి వైపు వ్యక్తి)

భువనేశ్వర్‌: అలోక్‌ త్రిపాఠి తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్‌ మండలం కొత్త మండల రైల్వే అధికారి (డీఆర్‌ఎమ్‌)గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ హోదాలో అంకితభావంతో సేవలందించిన హెచ్‌ఎస్‌ బజ్వా నుంచి బాధ్యతలు స్వీకరించారు. 1974 జనవరి 12న జన్మించిన త్రిపాఠి 1999 సెప్టెంబర్‌ 20న భారతీయ రైల్వే సేవా రంగంలో అడుగు పెట్టారు. ఇంతకు ముందు అలోక్‌ త్రిపాఠి న్యూఢిల్లీలోని రైల్వే బోర్డులో ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ (ఫ్రైట్‌ మార్కెటింగ్‌), నేషనల్‌ హై స్పీడ్‌ రైల్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌లో జనరల్‌ మేనేజర్‌, అహ్మదాబాద్‌లో అసిస్టెంట్‌ ఆపరేషన్స్‌ మేనేజర్‌ (ఏఓఎం), వదోదరలో డివిజనల్‌ ఆపరేషన్స్‌ మేనేజర్‌ (డీఓఎం) , పశ్చిమ రైల్వేలో ఏరియా రైల్వే మేనేజర్‌ (ఏఆర్‌ఎం), రాజ్‌కోట్‌లో సీనియర్‌ డివిజనల్‌ కమర్షియల్‌ మేనేజర్‌ (సీనియర్‌ డీసీఎం)గా , రాజ్‌కోట్‌ , రత్లాం ప్రాంతాల్లో సీనియర్‌ డివిజనల్‌ ఆపరేషన్స్‌ మేనేజర్‌ (సీనియర్‌ డీఓఎం)గా పలు హోదాల్లో కీలకమైన బాధ్యతల్ని విజయవంతంగా నిర్వహించారు.

మల్కన్‌గిరి ప్రజలు సౌమ్యులు



వీడ్కోలు సభలో కలెక్టర్‌ ఆశీష్‌ ఈశ్వర్‌ పటేల్‌, ఇతర అధికారులు



మాట్లాడుతున్న ఆశీష్‌ ఈశ్వర్‌

- కలెక్టర్‌ ఆశీష్‌ ఈశ్వర్‌ పటేల్‌
- ఘనంగా వీడ్కోలు పలికిన సిబ్బంది

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ప్రజలు ఎంతో సౌమ్యులని కలెక్టర్‌ ఆశీష్‌ ఈశ్వర్‌ పటేల్‌ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు సిబ్బంది సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా అదనపు కలెక్టర్‌ వేద్బర్‌ ప్రధాన్‌ అధ్యక్షతన వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌గా 11 నెలలు అందించిన సేవలను వివిధ శాఖల అధికారులు కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పటేల్‌ చేసిన కృషిని ప్రశంసించారు. గిరిజనులకు పోడు పట్టాలు అందించేయందుకు చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ ఆశీష్‌ ఈశ్వర్‌ పటేల్‌ మాట్లాడుతూ.. మల్కన్‌గిరి జిల్లాలో పని చేసింది కొద్ది నెలలైనప్పటికీ తన హృదయంలో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. అమాయక గిరిజనుల ప్రేమ, గౌరవం ఎప్పటికీ గుర్తుగా ఉంటుందన్నారు. కార్యాలయ సిబ్బంది ఎంతోగానో సహకరించారన్నారు. అందరి సహకారంతోనే జిల్లాను అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ డివిజన్‌ అధికారి సాయికిరణ్‌, జిల్లా అదనపు కలెక్టర్‌ సోమనాథ్‌ ప్రధన్‌, జిల్లా అభివృద్ధి అధికారి నరేశ్‌చంద్ర పటేల్‌, జిల్లా సబ్‌ కలెక్టర్‌ దుర్యోధన్‌ బఠణి, జిల్లా అదనపు ఎస్పీ రష్మి రంజన్‌ సేనపతి తదిరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్‌ చంద్ర సభోరో

రాయగడ కొత్త కలెక్టర్‌ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను స్వాగతిస్తున్న ఏడీఎం నిహారి రంజన్‌ కుహరో తదితరులు

రాయగడ: జిల్లా కొత్త కలెక్టర్‌గా అశుతోష్‌ కులకర్ణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన స్థానిక మజ్జిగౌరి మందిరానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా అదనపు కలెక్టర్‌ నిహారి రంజన్‌ కుహరొ, సబ్‌ కలెక్టర్‌ రమేష్‌ కుమార్‌ నాయక్‌, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్‌ ప్రధాన్‌ తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు

నదిలో మునిగి బోల్‌భమ్‌ భక్తుడు మృతి



నదిలో నుంచి బడదొలాయి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం



నది వద్ద గ్రామస్తులు, బోల్‌భం భక్తులు



కన్హా బొడొదొలాయి (ఫైల్‌)

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌ సబ్‌ డివిజన్‌ పరిధి భీమ్‌పూర్‌ పంచాయతీలోని దీనబంధుపూర్‌ వద్ద గల మహేంద్రతనయ నదిలో మునిగి బోల్‌భం భక్తుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు గజపతి జిల్లా నువాగడ సమితి కేజాలర్‌సింగ్‌ గ్రామానికి చెందిన కన్హా బొడొదలాయి (24)గా గుర్తించారు. సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. బోల్‌భమ్‌ దీక్షను తీసుకున్న 30 మంది భక్తులు సోమవారం వేకువజామున భీమపూర్‌లోని శివుని మందిరానికి వెళ్లి జలంతో అభిషేకం చేసేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో బొడొదలాయి కూడా భక్తులతో పాటు అక్కడకు వెళ్లాడు. అంతా నదీలో స్నానాలు చేసుకుని జలాలను కలశంతో పట్టుకుని సిద్ధంగా ఉన్న సమయంలో బహిర్భూమికని వెళ్లిన బొడొదలాయి ఇంకా తిరిగి రాకపోవడంతో భక్తులు అనుమానించి నదిలో మునిగిపోయినట్లు గుర్తించి సమీపంలోని గ్రామస్తులను సహాయం కొరారు. దీంతో కొందరు గ్రామస్తులు నదిలో దూకి సుమారు రెండు గంటలపాటు వెతికి బొడొదలాయి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు.

జయపురం రైల్వేస్టేషన్‌ ముట్టడి



రైల్వే స్టేషన్‌ ముట్టడిలో మాట్లాడుతున్న రబినారాయణ నందో

జయపురం: విశాఖపట్నం–కిరండూల్‌ ప్రయాణికుల రైలును వెంటనే కొరాపుట్‌–జగదల్‌పూర్‌కు పునరుద్ధరించాలని బీజేడీ శ్రేణులు డిమాండ్‌ చేస్తూ సోమవారం జయపురం రైల్వే స్టేషన్‌ను ముట్టడించాయి. రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రబినారాయణ నందో నేతృత్వంలో వందలాది మంది బీజేడీ నేతలు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పార్టీ జెండాలతో రైల్వే స్టేషన్‌ముఖ ద్వారం ముంగిట బైఠాయించారు. ఈ సంద్భంగా రైల్వే అధికారికి మెమోరాండం సమర్పించారు. గత 27 రోజులుగా కొరాపుట్‌ నుంచి జగదల్‌పూర్‌ మధ్య ప్రయాణికుల రైళ్ల రాక పోకలు పూర్తిగా నిలిచిపోయాయని, అయినా రైల్వే అధికారులు రైళ్లు నడిపేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. గత నెల 2 నుంచి జగదల్‌పూర్‌–కొరాపుట్‌ మధ్య ప్రయాణికుల రైళ్లు నిలిచిపోవటం వల్ల విశాఖపటణ్ణం, రూర్కెలా, హౌరా, భువనేశ్వర్‌లకు రైళ్ల రాక పోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారు వెల్లడించారు. మరో పక్క గూడ్స్‌ రైళ్లు యథాతదంగా నడుస్తున్నాయని తెలియజేశారు. రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్‌ చేశారు. అలాగే జయపురం–జగదల్‌పూర్‌ల మధ్య ఒక కొత్త రైలును వేయాలని, అలాగే జగదల్‌పూర్‌ నుంచి సంబల్‌పూర్‌, అనుగోల్‌, కటక్‌, భువనేశ్వర్‌ మీదుగా పూరి వరకు ప్రతిదినం రైలు నడపాలని డిమాండ్‌ చేశారు. అలాగే జయపురం–మల్కన్‌గిరి, జయపురం– నవరంగపూర్‌ ల రైలు మార్గాల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. పాసింజర్‌ రెళ్లు కొరాపుట్‌ వరకు వస్తున్నాయని, కొరాపుట్‌ నుంచి జగదల్‌పూర్‌ వరకు రైళ్లు నిలిచి పోయాయని వారు గుర్తు చేశారు. జయపురం–జగదల్‌పూర్‌ల మధ్య రైలు నడపాలని ఎంతో కాలంగా డిమాండ్‌ చేస్తున్నామని అన్నారు.



స్టేషన్‌ ముందు బైఠాయించిన బీజేడీ శ్రేణులు



స్టేషన్‌ లోనికి వెళ్లబోతున్న ఆందోళన కారులను అడ్డుకుంటున్న పోలీసులు



రైల్వే అధికారులకు మెమొరాండం సమర్పిస్తున్న బీజేడీ నేతలు

క్లుప్తంగా

రావిశాస్త్రి ప్రసంగానికి శరత్‌బాబు ఎంపిక



జంధ్యాల శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్: సుప్రసిద్ధ రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని ఆల్ ఇండియా రేడియోలో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమానికి నగరానికి చెందిన రచయిత జంధ్యాల శరత్‌బాబు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 30న రావిశాస్త్రి జయంతి పురస్కరించుకొని 'సామాన్యుడి అండదండ రావిశాస్త్రి' అంశంపై ప్రసంగం చేయనున్నారు.

యువతి ఆత్మహత్య

తడ: అనారోగ్యంతో శ్రీకాకుళం జిల్లా, నందిగాం మండలం, గొల్లవూరు గ్రామానికి చెందిన జీరు పూజిత(21) అనే యువతి ఆదివారం రాత్రి తన గదిలో ఉరి వేసుకుని మృతి చెందింది. ఎస్‌ఐ కొడపనాయుడు కథనం మేరకు.. తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేసే పూజిత తడకండ్రిగలోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ గదిలో అద్దెకు నివసిస్తోంది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆమెను అదే పరిశ్రమలో పని చేసే ఆనంద్ కృష్ణన్ అనే మిత్రుడు తరచూ పరామర్శిస్తుండేవాడు. ఈ క్రమంలో చనిపోయిన రోజు కూడా ఆనంద్ కృష్ణన్ ఆమెను ఉదయం పలకరించి వెళ్లాడు. సాయంత్రం వచ్చిన అతను పూజిత గదిలో సీలింగ్ ఫ్యాన్‌కి చున్నీతో ఉరి వేసుకుని ఉన్నట్టు గమనించి, అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మరో వ్యక్తి సాయంతో తలుపులు పగుల కొట్టి ఆమెను కిందకు దించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మృతురాలి తండ్రి శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వడంతో సోమవారం తడకు వచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొడపనాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పెదపాడు పంచాయతీ పరిధి ధర్మాన లే అవుట్‌లో భార్యాభర్తల మధ్య తలెత్తిన తీవ్ర మనస్పర్థలు ఓ వివాహిత ప్రాణాలను బలిగొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మాన లే అవుట్‌లో నివసిస్తున్న యవ్వారి రాజేష్ కుటుంబంలో ఒక శుభ కార్యానికి సంబంధించి భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ గొడవలో తన అభిప్రాయానికి విలువ లేకుండా భర్త మాటే నెగ్గుతుందని భావించిన భార్య అనూష(30) తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో ఈనెల 23వ తేదీన దోమల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన స్థానికులు వెంటనే శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న అనూష సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి పాలవలస మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం



రణస్థలం: మండలంలోని పైడి భీమవరం గ్రామానికి చెందిన కంఠస్ఫూర్తి కనకరాజు ఈనెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని జే.ఆర్.పురం పోలీసులు సోమవారం తెలిపారు. వయస్సు 78 సంవత్సరాలు, మతి స్థిమితం సరిగ్గా లేదని చెప్పారు. ఈ మేరకు కుమారుడు సత్తిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎస్.చిరంజీవి వెల్లడించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి దూసి – పొందూరు రైల్వేస్టేషన్ల మధ్యలో సోమవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుడికి సుమారు 65 ఏళ్ల వయస్సు ఉంటుందని, నీలం, ఎరుపు రంగు గీతల షర్టు, నీలం గళ్ల లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించామన్నారు.

ముద్దాయికి రెండున్నర ఏళ్ల జైలు శిక్ష

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరు పంచాయతీ పరిధి కొత్త కొత్తూరులోని ఉమామల్లిఖార్జున స్వామి ఆలయం తాళాలను, హిరమండలంలోని సుబలాయి గ్రామానికి చెందిన రాగోలు బాలకృష్ణ 2019లో పగలుగొట్టి రూ.20 వేల నగదును చోరీ చేశాడు. ఈ ఘటనలో ముద్దాయి బాలకృష్ణపై నేరం రుజువు కావడంతో ఆయనకు కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కందికట్ల రాణి సోమవారం రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్లు స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు సోమవారం తెలిపారు. ఈ ఘటనపై 2019వ సంవత్సరంలో కొత్తూరు ఎస్‌ఐగా పని చేసిన బాలకృష్ణ కేసు నమోదు చేశారు. కేసును ఎస్‌ఐలు బాలకృష్ణ, కె.గోవిందరావులు దర్యాప్తు చేశారన్నారు. ఏపీపీగా ఎల్.నాగభూషణరావు వ్యవహరించారు.



● ఓం శివోహం

శ్రావణ మాసం మూడో సోమవారం పురస్కరించుకుని ఏకామ్ర క్షేత్రం కిటకిట లాడింది. వేకువ జాము 3 గంటల నుంచి బోల్ భం భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి బారులు తీరారు. బోల్ భం నినాదాలతో ఏకామ్ర క్షేత్రం ప్రతిధ్వనించింది. పవిత్ర శ్రావణ సోమవారం సందర్భంగా ఈ క్షేత్రంలో నిత్య పూజలందుకుంటున్న లింగరాజు మహా ప్రభువుకు శుద్ధ జలాభిషేకం చేశారు.

- భువనేశ్వర్

బీజేపీ నాయకుల మాటలు అర్ధరహితం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

● పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి కత్తల కవిటి పంచాయతీ డాక్టరు బంజిరి గ్రామంలో 43 ఎకరాల భూవివాదంపై బీజేడీ పార్టీపై మాజీ ఎమ్మెల్యే (బీజేపీ) కోడూరు నారాయణరావు చేసిన వివాదాస్పద వాఖ్యలను ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా బీజేడీ అధ్యక్షుడు ప్రదీప్ నాయక్ ఖండించారు. వాటి మాటలు అర్థరహితమన్నారు. బీజేడీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టరు బంజిరి గ్రామంలో 50 ఎకారాల ప్రైవేట్ భూమిలో 5 ఎకరాల భూమి బరంపురం పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ యాజమాన్యం ప్రియాంకా సాబత్ పేరిట రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయని జెడ్పీటీసీ ఎస్.బాలరాజు తెలియజేశారు. ఆర్నెళ్లుగా డాక్టరు బంజిరి భూములు ఆదివాసీ, దళిత ప్రజలకు చెందాలని పోరాడుతుండగా.. ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు మేల్కోని తమ పార్టీ నేతల హస్తం ఉందని ఆరోపించడం సబబు కాదని జెడ్పీటీసీ (గుసాని) బాలరాజు అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందని, డాక్టరు బంజిరిలో వంద మంది ఆదివాసీ, దళిత కుటుంబాలకు న్యాయం చేసే దిశగా పోరాడితే మంచిదని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. ప్రస్తుతం తాము డాక్టరు బంజిరి వివాదాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని, దీనిపై తుదివరకు పోరాడతామని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. గజపతి కలెక్టర్‌తో డాక్టరు బంజిరి భూముల వివాదంపై మాట్లాడతామని ఎమ్మెల్యే పాణిగ్రాహి తెలియజేశారు. విలేకరుల సమావేశంలో గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు, పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి, ఆర్.ఎం.సి. ప్రెసిడెంట్ ఎస్.గజపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..



జయపురం: ప్రజాభియోగాల శిబిరంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

జయపురం: జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాభియోగాల శిబిరంలో 36 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 27 ఫిర్యాదులు వ్యక్తిగతం కాగా.. 9 ఫిర్యాదులు కమ్యూనిటీ పరంగా వచ్చాయి. కొరాపుట్ నూతన కలెక్టర్ మనోజ్ సత్యభాను మహాజన్ మొదటి సారి పాల్గొన్న ప్రజాభియోగ శిబిరంలో జయపురం సిటిజన్ కమిటీ వారు చేసిన ఫిర్యాదులో జయపురం జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో స్పెషలిస్టు డాక్టర్లను తగినంత మందిని నియమించాలన్నారు. పోస్టాఫీసులో రైల్వే టికెట్ కౌంటర్ ప్రారంభించాలని, టంకువ నుంచి రైల్వే స్టేషన్ వరకు సిటీ బస్సు వేయాలని, జనన, మరణ ధ్రువపత్రాలు మునిసిపాలిటీలోనే ఇవ్వాలని, తదితర డిమాండ్లతో కమిటీ అధ్యక్షురాలు బినోదిని శాంత వినతిపత్రం సమర్పించారు. బరిణిపుట్ పంచాయతీ ముండిగుడ ఒడీసీ కాలనీలో 2 వందల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేయాని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శౌర్య రెడ్డి, సీడీఎంఓ రబఅంద్రనాథ్ మిశ్ర, ఎస్పీ రోహిత వర్మ, ఐఏఎస్ ప్రొహిబిషన్ సంతోష్ పడర్, తదితరులు పాల్గొన్నారు.

పద్మపూర్‌లో..

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌లో జిల్లా అదనపు కలక్టర్ నిహారి రంజన్ ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 60 వినతులను స్వీకరించారు. వాటిలో 53 వ్యక్తి గత సమస్యలుగా, మిగతా 6 గ్రామ సమస్యలుగా గుర్తించారు. గుణుపూర్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్. కుమార్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ బి.సరోజిని దేవి, పద్మపూర్ సమితి అధ్యక్షులు మణిమాల సబర్, తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: వినతుల స్వీకరణలొ పాల్గొన్న అదనపు కలెక్టర్, తదితరులు

ఘనంగా సహీద్ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న లిబరేషన్ పార్టీ కార్యకర్తలు

రాయగడ: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ వ్యవస్థాపకుడు చారుమజుందార్ 53వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాలోని ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కొలనార సమితి పరిధి కెరేడీ గ్రామంలో సహీద్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి గొమాంగో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేరేడి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మజుందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దళిత, బడుగు వర్గాల అభ్యున్నతికి మజుందార్ పోరాడారని గుర్తు చేశారు.

138 కేసులు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి, తదితరులు

జయపురం: ఒడిశా న్యాయ సేవా ప్రదీకరణ ఆదేశం మేరకు కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు సోమవారం కొరాపుట్ జిల్లా స్థాయి లోక్ అదాలత్‌ను నిర్వహించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఎన్‌ఐ చట్టపు కేసులు మాత్రమే పరిష్కరించారు. ఎన్‌ఐ చట్టం సెక్షన్ 138 కేసులను ఉభయ వర్గాల మధ్య అవగాహన కల్పించి వారి సమ్మతితోనే కేసులు పరిష్కరించారు. జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ మహంతి, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ విష్ణు ప్రసాద్ దేబత, శాశ్వత లోక్ అదాలత్ విచారపతి ప్రద్యోమయి సుజాత, సబ్ డివిజనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సంతోష్ కుమార్ బారిక్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ హరమోహణ దాస్ కేసులను పరిష్కరించారు. జిల్లా స్థాయి లోక్ అదాలత్‌లో 49 ఎన్‌ఐ కేసులలో 12 కేసులు పరిష్కరించి రూ.37,45,777 జరిమానా రూపంలో వసూలు చేసినట్లు ప్రద్యోమయి సుజాత వెల్లడించారు.

గ్రీవెన్స్‌సెల్‌కు 48 వినతులు



గ్రీవెన్సు సెల్‌కు హాజరైన నూతన కలెక్టర్ మధుమిత



మొక్కను నాటుతున్న కలెక్టర్ మధుమిత



మహిళా గ్రూపులు పండించిన కాయగూరలను పరిశీలిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ అమెడా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ మధుమితతోపాటు జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, డీఎఫ్‌వో కె.నాగరాజు, ముఖ్యకార్యనిర్వాహణాధికారి (జిల్లా పరిషత్తు) శంకర కెరకెటా, ఐటీడీఏ పీవో అంశుమాన్ మహాపాత్రో, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు హాజరయ్యారు. అంగార్‌సింగి, లోబ, అమెడా, పోత్తురో గ్రామ పంచాయతీల నుంచి 48 వినతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. వీటిలో వ్యక్తిగతం 19, గ్రామ సమస్యలపై 29 వినతులు ఉన్నాయి. వినతులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కారం చేయాలని కలెక్టర్ అధికారులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు గుర్తింపుకార్డులను అందజేశారు. అనంతరం రాయఘడ బ్లాక్ ఆవరణలో కలెక్టర్ మొక్కలను నాటారు. రాయఘడ సమితి అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, సీడీఎంవో డాక్టర్ ఎం.ఎం.ఆలీ పాల్గొన్నారు.

నిరాహార దీక్ష



కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలో కూర్చున్న మాజీ సర్పంచ్ దీప్తి ప్రభాలాల్ శోబోరో

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ ప్రభుత్వ ఎస్.ఎస్.డి (ఆశ్రమ) ఉన్నత పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో చేపట్టిన అడ్మిషన్లలో ప్రధాన ఉపాధ్యాయులు సురేష్ సాహుకార్ అనేక అవకతవకలకు పాల్పడ్డారని సర్పంచ్ దీప్తి ప్రభాలాల్ శోబోరో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష సోమవారం చేపట్టారు. హెచ్‌ఎం సురేష్ సాహుకార్ వల్ల అనేక మంది ఆదివాసీ, దళిత విద్యార్థులు అడ్మిషన్లు పొందకుండా మిగిలిపోతున్నారని మాజీ సర్పంచ్ ఆరోపించారు. 2022లో కూడా దళిత, అదివాసీ అనాథ విద్యార్థులు ఇద్దరిని సెలక్షన్ లిస్టులో తొలిగించిన ఉదంతం జిల్లా సంక్షేమ శాఖ అధికారికి విన్నవించినా పాఠశాల హెచ్‌ఎంపై అధికారులు చర్యలు చేపట్టలేదని మాజీ సర్పంచ్ దీప్తి ప్రభాలాల్ శోబోరో తెలిపారు. జిల్లా కలెక్టర్ మధుమిత రాయఘడ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: గోవిందపురం ఉన్నత పాఠశాలలో 1989–1990 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదవిన పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. తోటి మిత్రుడు రవిశంకర్ పాడి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుకుసున్న స్నేహితులు రూ. 30 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా నవరంగాపూర్ బ్లాక్ అంబోధరలో ఉంటున్న అతని ఇంటికి సోమవారం వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మద్దిల హరినారాయణ, బొడ్డేపల్లి మోహన్, కీలు లోకనాథం, పుచ్చ అప్పలస్వామి, జామి మధు ఉన్నారు.

కారులో నాటుసారా రవాణా

● ఇద్దరు వ్యక్తులు అరెస్టు



స్వాధీనం చేసుకున్న కారు, నాటుసారాతో ఎక్సైజ్ సిబ్బంది

కంచిలి: ఒడిశా నుంచి ఆంధ్రా గ్రామాలకు విచ్చలవిడిగా నాటుసారా రవాణా అవుతోంది. ఏకంగా కార్లలోనే దర్జాగా నాటుసారాను పాలిథిన్ సంచుల్లో, చిన్నసైజు ప్యాకెట్ల రూపంలో పల్లెలకు దిగుమతి చేసుకుంటున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ రవాణాపై పటిష్ట నిఘా పెట్టారు. ఒడిశా – ఆంధ్ర అంతర్రాష్ట్ర కార్ల కదలికల మీద నిఘా ఉంచారు. ఈ నిఘాలో భాగంగా ఒడిశా సరిహద్దు గ్రామమైన కేసరపడ వద్ద ఒక కారు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని పరిశీలించారు. దీంతో ఆ కారులో ఆరు ప్లాస్టిక్ గోనె సంచుల్లో ఒక్కొక్కదానిలో 150 నాటుసారా ప్యాకెట్లను ప్యాక్‌చేసి, మొత్తంగా 900 నాటుసారా ప్యాకెట్లు(90 లీటర్లు) తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. సారాతో పాటు కారును సీజ్‌చేసి, నాటుసారా రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం మునిసిపేటకు చెందిన మొగిలి కుమార్‌ను, నాటుసారా తెప్పించిన పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన లోట్ల జోగారావును అరెస్టు చేశారు. నాటుసారా పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతిలను సీఐ అభినందించారు.

యువకుడి మృతిపై ఆందోళన



మృతదేహంతో ర్యాలీ చేస్తున్న కుటుంబ సభ్యులు



శ్రీరాములు (ఫైల్)

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలంలోని పెద్ద బమ్మిడి గ్రామానికి చెందిన పినిమింటి శ్రీరాములు(20) అనే యువకుడు శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానం ఉందంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు శ్రీరాములు ఈనెల 25వ తేదీన కొంతమంది యువకులతో కలిసి ద్విచక్ర వాహనంపై సారవకోట మండలం వైపు వెళ్లాడు. అయితే అదేరోజు రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో తమ కుమారుడిని ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కానీ శ్రీరాములుది రోడ్డు ప్రమాదం కాదని, గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. తీవ్రగాయాలతో బ్రెయిన్ డెడ్ కావడంతో చికిత్స పొందుతూ శ్రీరాములు 27వ తేదీన మృతి చెందాడని, తన కుమారుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి లక్ష్మణరావు, తల్లి లక్ష్మీతో పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సోమవారం మృతదేహంతో పెద్దబమ్మిడి వద్ద ర్యాలీ చేపట్టారు. అయితే ఇదే విషయంపై సారవకోట పోలీసులను ప్రశ్నించగా మృతి చెందిన యువకుడు ఈనెల 25వ తేదీన సారవకోట మండలం జగ్గయ్యపేట వద్ద రోడ్డు పక్కన ఉన్న రైలింగ్‌ను ఢీకొన్నట్లు పేర్కొన్నారు. ఇది గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108లో శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 27వ తేదీన మృతి చెందినట్లు తెలిపారు. కాగా శ్రీరాములు అవయవదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది ఆ యువకుడి అవయవాలను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎచ్చెర్ల ఎంపీపీ చిరంజీవి అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని ఎచ్చెర్ల మండలానికి చెందిన ఎంపీపీ మొదలవలస చిరంజీవిని ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం వేకువఝామున ఫరీదుపేటలోని ఆయన స్వ గృహానికి జిల్లా పోలీసుల సహకారంతో ఒడిశా పోలీసులు చేరుకుని వారెంటు చూపించి అరెస్టు చేసినట్లు జేఆర్ పురం సీఐ అవతారం పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. 1999లో ఒడిశాలోని కొరాపుట్ జిల్లా దమన్‌జోడి పోలీస్ స్టేషన్ పరిధిలో నాల్కో కంపెనీ తరఫున కాంట్రాక్ట్ పనులు చేయించారని, వ్యాపార లావాదేవీల్లో అక్కడ గొడవ రావడంతో చిరంజీవిపై కేసు నమోదైందన్నారు. చిరంజీవిని రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు.

'కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి'



కాలువ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన రహదారు లు, భవనాల శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌తో కలసి ఆయన నూతన కలెక్టరేట్ భవనాన్ని, అక్కడ జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యతపై ఎక్కడా రాజీ పడకూడదన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై రైతుల కన్నెర్ర



వసప వద్ద ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ

● వసపలో ఇసుక వాహనాలు అడ్డుకున్న రైతులు
● అక్రమ తవ్వకాలు ఆపాల్సిందేనని డిమాండ్

కొత్తూరు: కొత్తూరు మండలంలోని బలద ఇసుక ర్యాంపు పేరుతో వసప గ్రామం సమీపంలో వంశధార నది వద్ద నిర్వహిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై రైతులు సోమవారం కన్నెర్ర చేశారు. భారీ వాహనాలు తమ పొలాల దారి మీదుగా వెళ్తుండడంతో నిత్యం భయపడుతున్నామని తెలిపారు. ఇసుక టిప్పర్లు వెళ్లకుండా రోడ్డు మీద బైఠాయించి ఆందోళన చేశారు. ఇసుక వాహనాల రాకపోకల వల్ల తాము కనీసం బైక్‌పై ఎరువులు కూడా తీసుకెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సంఘీభావం తెలపడం విశేషం. బలద రెవెన్యూ పరిధిలో ఉన్న ఇసుక ర్యాంపు నిర్వహించాలని ప్రభుత్వం మంజూరు చేస్తే వసప గ్రామం వద్ద ర్యాంపు నిర్వహించడం తగదన్నారు. ఇసుక ర్యాంపును నిలుపుదల చేయాలని తహసీల్దార్‌ను ఫోన్‌లో కోరారు.

మలేరియాతో బాలిక మృతి



గాయత్రి దొండియా (ఫైల్)

కంచిలి: మండలంలోని కొనక గ్రామానికి చెందిన పదమూడేళ్ల బాలిక గాయత్రి దొండియా మలేరియా జ్వరంతో మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. ఈ బాలిక గ్రామ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ జ్వరం బారిన పడింది. ఈ నెల 17వ తేదీన మఠం సరియాపల్లి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయడంతో మలేరియా జ్వరంగా తేలింది. పరిస్థితి విషమించడంతో సోంపేట సీహెచ్‌సీకి రిఫర్ చేయగా, అక్కడి నుంచి బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు సుస్మితారెడ్డి వివరించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకొన్నాయి. మృతురాలి తండ్రి బైలోడు, తల్లి తిలోత్తమలు కూలీలుగా జీవిస్తున్నారు. వీరికి మృతి చెందిన బాలికతోపాటు రెండేళ్ల కుమారుడు నితిన్ ఉన్నాడు. బాలికకు మలేరియా పాజిటివ్ రావడంతో గ్రామంలో వైద్యశిబిరాన్ని కూడా నిర్వహించారు.

క్లుప్తంగా

నూతన సంస్కరణలపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు

పార్వతీపురం టౌన్: ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థలో నూతన సంస్కరణలు, నూతన సిలబస్ పై అవగాహన తప్పనిసరి అని పార్వతీపురం మన్యం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లాలో గల అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిలబస్ మార్పు, సబ్జెక్టుల కలయిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రశ్నపత్రంలో మార్పులను వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు వివరించారు. మ్యాథ్స్ ఎ, బి సబ్జెక్టులను విలీనం చేసి మాథ్స్ ఒకే సబ్జెక్టు గాను, బోటనీ, జువాలజీ సబ్జెక్టులను విలీనం చేసి బయాలజీ సబ్జెక్టు గాను ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులకు అమలు చేయనున్నట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరం గ్రూపులకు సిలబస్‌లో మార్పు, సబ్జెక్టుల విలీనం, ప్రశ్నపత్రంలో మార్పు ఈ విద్యాసంవత్సరంలో ఉండవన్నారు. 2026- 27 విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పై మార్పులు ఉంటాయని తెలియజేశారు. ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం మొదటి సంవత్సరంలో నూతన పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆ సిలబస్ ఆధారంగానే ఈ ఏడాది నుంచి జరిగే పరీక్షల ప్రశ్నపత్రాల తయారీ జరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థులను సంసిద్ధులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు, ఇతర కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామం సమీపంలో కిత్తన్నపేట గ్రామానికి వెళ్లే దారిని ఆనుకుని ఉన్న తుప్పల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గమనించారు. ఈ సమాచారం అందడంతో ఎస్సై నవీన్‌పడాల్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని చంపి మూడు రోజుల క్రితమే ఈ ప్రాంతంలో పడేశారని స్థానికులు చెప్పుకుంటున్నారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. గళ్ల లుంగీ, లైట్ నీలంరంగు టీషర్ట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. స్థానికులు, చుట్టు పక్కల గ్రామస్తులను విచారణ చేయగా ఈ వ్యక్తి ఈ ప్రాంతం వాడు కాదని తెలిపారు. ఈ మేరకు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లగేజీ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీకనకమహాలక్ష్మి ఆలయ సమీపంలో చిన్న చెరువు వద్ద జరిగిన ప్రమాదంలో పుర్రేయవలస గ్రామానికి చెందిన కుప్పిలి శ్రీనివాసరావు(37) సంఘటన స్థలంలోనే మృతిచెందగా మరో వ్యక్తి కుప్పిలి నీలబాబుకు గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి మృతుని భార్య మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దామోదరరావు తెలిపారు.ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు పుర్రేయవలస గ్రామానికి చెందిన కుప్పిలి శ్రీనివాసరావు, కుప్పిలి నీలబాబు మధ్యాహ్నం 1:40గంటల సమయంలో పల్సర్ బైక్‌పై చీపురుపల్లి నుంచి పుర్రేయవలస వెళ్తున్నారు. అదే సమయంలో లావేరు నుంచి చీపురుపల్లి వస్తున్న లగేజ్ వ్యాన్ వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందగా నీలబాబుకు గాయాలయ్యాయి.

నానో యూరియా, డీఏపీతో అధిక దిగుబడులు



నానో యూరియాను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: యూరియా, డీఏపీకి బదులుగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి తెచ్చిన నానో యూరియా, నానో డీఏపీని రైతులు వినియోగించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ రైతులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నానో యూరియా, డీఏపీ కౌంటర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. నానో ఎరువులతో రైతులకు ఆర్థిక భారం తగ్గడంతోపాటు మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ పాల్గొన్నారు.

ఇలా వదిలి.. అలా నిలిపేసి..!



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

- భగ్గుమన్న పెదంకలాం ప్రాజెక్టు ఆయకట్టు రైతులు
- కొద్దిగంటల్లోనే సాగునీటి సరఫరా నిలిపివేతపై ఆందోళన



డీఈఈని చుట్టుముట్టిన దృశ్యం



పెదంకలాం ప్రాజెక్టు వద్ద సాగునీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయచంద్ర (ఫైల్)

పార్వతీపురం: రైతులు, సాగునీటి ప్రాజెక్టు సంఘం నాయకుల ఆధ్వర్యంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆర్భాటంగా ఈనెల 27న ఆదివారం పెదంకలాం ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీటి సరఫరాను ప్రారంభించారు. అయితే కాలువల ద్వారా పక్కనున్న గ్రామాలకు కూడా సాగునీరు సరఫరా కాకముందే నిలిపివేయడంపై రైతులు భగ్గుమన్నారు. గతంలో కాలువల పరిధిలో ఉన్న గ్రామాలకు సాగునీరు పుష్కలంగా సరఫరా అవడంతో పంటలు సమృద్ధిగా పండేవని, గడిచిన తొమ్మిదేళ్ల నుంచి కాలువలు అధ్వానంగా ఉండడంతో పూర్తిస్థాయిలో సాగునీరు సక్రమంగా సరఫరా కాక శివారు భూములకు సాగునీరు అందక రైతులు ప్రతి ఏటా నష్టపోవాల్సి వస్తోంది. కాలువలకు సంబంధించి పూడికలు తొలగించకుండా, గ్రోయిన్ షట్టర్లకు మరమ్మతులు చేపట్టకుండా సాగునీటిని కాలువల ద్వారా సరఫరా చేయడంపై అధికారుల తీరును, పాలకుల శైలిని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన

పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రైతు కూలీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో కొప్పెర నారాయణపురం గ్రామానికి చెందిన సుమారు 100 మంది రైతులు పెదంకలాం ప్రాజెక్టు నుంచి సాగునీటిని సరఫరాచేయాలని సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. శివారు భూములకు సాగునీరు సరఫరా చేయాలని, కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని, గ్రోయిన్ షట్టర్లకు మరమ్మతులు నిర్వహించాలని, శివారు గ్రామ రైతులకు పూర్తి స్థాయిలో సాగునీటిని సరఫరా చేయాలని నినాదాలు చేస్తూ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం నాయకులు ఎం.కృష్ణమూర్తి, బంటుదాసు, సింహాద్రి నాయుడు, గేదెల సత్యనారాయణలు మాట్లాడుతూ పెదంకలాం ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణకు 2020లో జైకా పథకం కింద రూ.17కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు పనులను ఎస్ఆర్‌కే కనస్ట్రక్షన్‌కు అప్పగించారని ఆ నిధులతో ప్రాజెక్టుకు సంబంధించి కాలువల ఆధునికీకరణ పనులు తూతూమంత్రంగా నిర్వహించడంతో పది గ్రామాల పరిధిలోని 10వేల ఎకరాలకు సాగునీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా కాకపోవడంతో రైతులు ప్రతి ఏటా పంటలు నష్టపోవాల్సివస్తోందని వాపోయారు. సాగునీటిని సరఫరా చేసేముందు కాలువల పరిస్థితుల గురించి, షట్టర్ల మరమ్మతుల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా ఆదరాబాదరాగా కాలువల ద్వారా సాగునీటిని ఎమ్మెల్యే ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు రైతులను నిండా ముంచుతున్నారని ఆరోపించారు. సాగునీటి సరఫరా పరిస్థితిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పెదంకలాం ప్రాజెక్టు కాలువల ద్వారా సాగునీటిని సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇరిగేషన్ డీఈఈ ముట్టడి

కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేపడుతున్న సమయంలో పెదంకలాం ప్రాజెక్టు డీఈఈ నారాయణ అక్కడికి రావడంతో రైతు సంఘం నాయకులు, రైతులు ఒక్కసారిగా చుట్టుముట్టి సాగునీటి సరఫరాపై నిలదీశారు. కాలువల్లో పూడిక తీత, షట్టర్ల మరమ్మతులు చేయకుండా కాలువల ద్వారా సాగునీటిని సరఫరా చేయడం రైతులను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు. శివారు భూములకు కాలువలద్వారా సాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాలువల ద్వారా సాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపడతామని రైతులు, రైతు సంఘ నాయకులకు డీఈఈ నచ్చజెప్పడంతో రైతులు శాంతించారు.

తక్కువ వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు ఇదే



పెదంకలాం ప్రాజెక్టును రూ.1.30 కోట్ల వ్యయంతో 8వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. కాలువల ఆధునికీకరణకు హుద్‌హుద్ తుఫాన్ సమయంలో జైకా నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో కాలువల ఆధునీకీకరణ పనులు నిర్వహించని కారణంగా కాలువల ద్వారా సాగునీరు సరఫరా కాని పరిస్థితి నెలకొంది. ప్రతి ఏటా సాగునీటి కోసం ఆందోళనే తప్పా సమస్యకు శాశ్వత పరిష్కారం కావడం లేదు.

– సింహాద్రి నాయుడు, రైతు కూలీసంఘం జిల్లా నాయకుడు, పార్వతీపురం

సాగునీరు సరఫరాపై చెప్పకోవడం సిగ్గుచేటు



పెదంకలాం ప్రాజెక్టు ద్వారా రైతులందరికీ సాగునీటిని సరఫరా చేస్తున్నామని సాక్షాత్తు ఎమ్మెల్యే చెప్పుకోవడం సిగ్గుచేటు. కాలువల్లో పూడికలు తొలగించకుండా సాగునీరు ఎలా సరఫరా అవుతుంది. శివారు భూములకు సాగునీరు సరఫరా అయ్యేలా చూడాలి.

– గేదెల సత్యనారాయణ, రైతు కూలీసంఘం నాయకుడు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్ –17 బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సిద్ధమైంది. ఈ మేరకు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోటీల్లో నలుగురు క్రీడాకారులు అంతర్ జిల్లాల పోటీలకు అర్హత సాధించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 78 మంది క్రీడాకారులు పాల్గొనగా..జిల్లా జట్టులో స్థానం దక్కించుకునేందుకు క్రీడాకారులు పోటీపడ్డారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో బాలుర విభాగంలో కాంద్రేగుల సోమనాథ్, వీర్రాజు వర్మలు ఉండగా..బాలికల విభాగంలో బోరా ప్రవల్లిక, సాయి జాహ్నవిశ్రీ ఉన్నారు. అదేవిధంగా బత్తుల జస్మిక, ఇషిక వర్మ తదితరులు కన్సొలేషన్ బహుమతులు దక్కించుకున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను త్వరలో కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్ –17 బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్‌కు పంపించనున్నట్లు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం కార్యదర్శి కేవీ జ్వాలాముఖి తెలిపారు. ఈ పోటీలను సీనియర్ నేషనల్ ఆర్బిటర్ రానా, అర్చన, పద్మావతిలు పర్యవేక్షించారు.

కలెక్టరేట్ వద్ద హమాలీల ధర్నా



ఏఐటీయూసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

విజయనగరం గంటస్తంభం: హమాలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ..ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద హమాలీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ముల్లు నర్సింహులు మాట్లాడుతూ..విజయనగరం జిల్లాలో గల 8 ఎంఎల్ఎస్ పాయింట్‌లలో సుమారు 200 మంది హమాలీలు 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. అప్పటికీ, ఇప్పటికీ పని భారం పెరుగుతూనే ఉంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి కూలి రేట్లు పెంచుతున్నా వచ్చే కూలితో తమ కుటుంబాలు గడవడం చాలా కష్టంగా ఉందని హమాలీలు వాపోయారు. మా పనిలో ప్రధానంగా చాలా సమస్యలున్నాయని, అందులో ముఖ్యంగా ప్రతినెలా స్టేజ్–2 బిల్లు 10వ తేదీలోపు ఇప్పించాలని, అన్‌లోడింగ్ బిల్లు కాంట్రాక్టర్ పేరుతో కాకుండా మా ఖాతాలోనే జమ చేసి, 15వ తేదీ లోపు ఇప్పించాలని కోరారు. అన్‌లోడింగ్ పనిని 30ఏళ్లుగా మేమే చేస్తున్నాం కాబట్టి మమ్మల్నే కొనసాగిస్తూ..మోత కూలి పెంచాలని డిమాండ్ చేశారు. హమాలీలకు చదువు లేనందున బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, వారానికి ఒకరోజు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను తీర్చని యెడల ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పి.కామేశ్వరరావు, హమాలీ సంఘం కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు నష్టం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు వాహన మిత్ర రూ.15,000 తక్షణమే చెల్లించాలని కోరుతూ..విజయనగరం జిల్లా శ్రీ కనకదుర్గ ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కో–కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, నగర కార్యదర్శి బి.రమణ, ఉపాధ్యక్షుడు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ..కరోనా తర్వాత ఆటో, టాటా ఏసీ మ్యాక్సీ క్యాబ్ వాహన డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ, తమిళనాడులో అనుభవాలను పరిశీలించి ఇక్కడ నష్టపోతున్న డ్రైవర్లకు ప్రత్యామ్నాయ చూపాలని డిమాండ్ చేశారు. లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు వాహన మిత్ర రూ.15,000 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వాహన రెన్యువల్ ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, లైసెన్స్ ఆర్టీవో అధికారులు చేయాలని, వేదాంత ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ చాలానా లు, పెట్టి కేసులు ఆపాలని, ఆటోల నిలుపుదలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆటో ప్రజల జీవన విధానంలో భాగంగా మారిందని అత్యవసర, నిత్యావసర సర్వీసులన్నీ అందిస్తున్నామని ఈ రంగాన్ని ఆదాయ వనరుగా భావించకుండా సర్వీస్ రంగంగా గుర్తించి ఆటోల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బి.పాపారావు, జి.కూర్మారావు, రామారావు, భాస్కరరావు, ప్రసన్న, లక్ష్మణరావు, రాజు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రాముఖ్యం ఇవ్వాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్



అర్జీదారుల సమస్యలు వింటున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల వినతులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్స్ మురళి, వెంకటేశ్వరరావు, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి 165 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, అర్జీదారు సంతృప్తి చెందేలా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు.



ఫిర్యాదు దారుల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 44 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ మేరకు ప్రజల నుంచి 44 ఫిర్యాదులను ఎస్పీ వకుల్ జిందల్‌తో పాటు ఏఎస్పీ సౌమ్యలత ఫిర్యాదులను స్వీకరించారు, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష



ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్/ మక్కువ: జంట హత్యల నేరం కేసులో ముద్దాయి గిన్నిపల్లి సింహాద్రికి పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు కోర్టు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధించినట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని మక్కువ పోలీస్‌స్టేషన్‌లో 2018లో నమోదైన జంట హత్యల కేసులో పలికివలస గ్రామానికి చెందిన ఒమ్మి పైడిరాజు ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గిన్నిపల్లి సింహాద్రి ముద్దాయిగా రుజువైందన్నారు. భూ వివాదంలో భాగంగా పైడిరాజు తల్లిదండ్రులు పొలంలో మేకలు మేపుతున్న సమయంలో సింహాద్రి హత్య చేయడంతో మృతుల కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టు విచారణలో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో రెండవ అదనపు జిల్లా జడ్జి శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు సిబ్బందికి ఎస్పీ మాధవ్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

18.8 మెట్రిక్ టన్నుల ఎరువుల సీజ్

- తెర్లాం, సుందరాడలో ఎరువుల దుకాణాల తనిఖీ



తెర్లాంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

తెర్లాం: మండలంలోని తెర్లాం, సుందరాడ గ్రామాల్లో గల ఎరువుల దుకాణాల్లో అనుమతి పత్రాలులేకుండా నిల్వఉంచిన 18.8మెట్రిక్ టన్నుల ఎరువులను జిల్లా వ్యవసాయధికారి వి.తారకరామారావు సీజ్‌చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని తెర్లాం, సుందరాడగ్రామాలలో గల ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఎరువుల దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువు లను, స్టాక్ రికార్డులు, అనుమతిపత్రాలను పరిశీలించారు. సుందరాడ లోని సూర్యచంద్ర ట్రేడర్స్‌లో నిల్వ ఉన్న 8.5 మెట్రిక్ టన్నుల యూరియాకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్‌చేశారు. అలాగే తెర్లాంలోని శ్రీరామ ట్రేడర్స్‌లో నిల్వ ఉన్న 10.3మెట్రిక్ టన్నుల యూరియాకు ఎటువంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో వాటిని కూడా సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో గల ఎరువుల దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులకు సంబంధించిన అనుమతి పత్రాలు లేకపోతే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించినా.. అధిక ధరలకు విక్రయించినా లైసెన్సులు రద్దుచేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం ఎరువుల కొరత లేదని, రైతుసేవా కేంద్రాల్లో నిల్వలు ఉంచామని చెప్పారు. ఆయనతో పాటు ఏఓ బొత్స శ్రీనివాసరావు ఉన్నారు.

అర్జీలకు 48 గంటల్లో పరిష్కారం చూపాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు 48 గంటల్లో పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్ఓ కె. హేమలత, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణిలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 122 మంది అర్జీ దారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులను నాణ్యతతో కూడిన పరిష్కారం చూపించేలా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సీతంపేట: పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పోలీస్ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

పార్వతీపురం రూరల్: పోలీస్ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చేయడమే తమ శాఖ లక్ష్యమని ఎస్పీ ఎస్‌వీ. మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 8 అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ ఎస్సై ఫకృద్దీన్ తదితర సిబ్బంది ఉన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 24 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 24 వినతులు వచ్చాయి. తుంబలి గ్రామానికి చెందిన కొండలరావు విద్యుత్ స్తంభాలు తమ గ్రామంలో వేయాలని కోరారు. కుంబిడి ఇచ్చాపురానికి చెందిన మండంగి బాలకృష్ణ ఫారెస్టు భూమి రీసర్వే చేయాలని విజ్ఞప్తి చేశాడు. సింగిడి గ్రామస్తుడు సూర్యవర్మ తమకు శాశ్వత ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారని చర్యలు తీసుకోవాలని కోరారు. పవర్ టిల్లర్ మంజూరు చేయాలని పలువురు రైతులు వినతులు ఇచ్చారు. కోదుల వీరఘట్టంకు చెందిన త్రినాథరావు తమ ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం రాలేదని ఫిర్యాదు చేశాడు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ఈఈ కుమార్, డిప్యూటీ ఈఓ రామ్మోహన్ రావు, జీసీసీ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, వ్యవసాయాధికారి వాహిని, ఏపీడీలు సన్యాసిరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లకు ఆదేశం



మిషన్ శక్తి-వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: వచ్చేనెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివాసీ దినోత్సవ నిర్వహణపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లా, ఐటీడీఏల స్థాయిలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గిరిజన సంప్రదాయ వస్తువులు, పనిముట్లు, ఇతర సామగ్రి ప్రదర్శనకు మ్యూజియంను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా గిరిజన లబ్ధిదారులకు భూ పట్టాలు, ఉప కరణాలు, చెక్కుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓలు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీఓ ఎ.మురళీధర్, డీఆర్‌డీఏ , డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె. రామచంద్రరావు, డీఎఫ్ఓ జీఏపీ ప్రసూన, జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి డి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా మిషన్ శక్తి

హింసకు గురైన మహిళలకు సహాయం చేసేందుకు, రక్షణ కల్పించేందుకు మిషన్ శక్తి–వన్‌స్టాప్ సెంటర్ పాత్ర కీలకమైనదని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మిషన్ శక్తి–వన్‌స్టాప్ సెంటర్, ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ సెంటర్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

దత్తతకు ముందుకు రావాలి

పీ–4 విధానంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. మార్గదర్శులకు తలెత్తే సందేహాలను నివృత్తి చేసి ఇష్టపూర్వకంగా ముందుకు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు.